# చెదపురుగుల ఆహారసమస్య

"వెలుగు"

మల్లాది వేంకటకృష్ణశర్మ.

'కావలెను- నేను వ్రాసిన పద్యగద్యాత్మక గ్రంథములు కంఠతాపట్టి నన్ను పొగడుటకు వేలకొలది ప్రజలు కావలెను వారివారి స్తోత్రపాఠములకు తగ్గట్లు జీతములు ఏర్పాటు చేయుదుము.

వలయువారు—

బ్రహ్మాండ గ్రంథమాల, పసందువీధి
బారిక పేటపోస్టు, వయా-కక్కుర్తి.

లోకనాథం ప్రకటన చదివాడు- మళ్లా మళ్లా చదువుకున్నాడు- వెంటనే అప్లికేషన్ పంపాలని భావించాడు- స్వయంగా బయలుదేరి వెళితే సంతృప్తావస్థలో పడ్డాడు. నిరుద్యోగ సమస్య పరిష్కరించి జీవన దానం చేసే కవులు జన్మించడం, కవులలో దాతల శాఖ నూతనంగా ఏర్పడడం అభ్యుదయ మనిభావించాడు- పత్రికలో మరొకవైపు తిరగ వేశాడు.

'కావలెను నాచే రచించబడి అచ్చువేయబడి బీర్వాలలో చెదపురుగులవల్ల చెడిపోవుచున్న పుస్తకములు దులిపి ప్రతిదినము ఎండబెట్టి బీర్వాలలో పేర్చుచుండుటకు ఉభయ భాషా, విద్వాన్ పరీక్షలు ప్యాసైన పండితులు ఆరుగురు కావలెను—

బ్రహ్మాండ గ్రంథమాల,
డిటో వీధి- డిటో పోస్టు- వయా డిటో.

లోకనాథం మళ్ళీ మొదటి ప్రకటన చదువుకున్నాడు. అందులో విద్వాన్ ఉభయభాషా ప్రవీణాది షరతులులేవు. కనక మొదటి ప్రకటన తనకు అనుకూలంగా ఉన్నట్టు భావించాడు- మరోప్రకట తిరగవేశాడు.

'కావలెను. చెదపురుగులను సంహరించి మన పవిత్ర గ్రంథములను కాపాడుటకు మందు కావలెను. అట్టిమందు కనిపెట్టువారిని సన్మానించి వెయ్యిన్నూట పదహార్లు బహుమానం యిచ్చుటయేగాక మందులమార్తాండ బిరుదుకూడా యివ్వబడును.

అంతాడిటో......

లోకనాథం ఈశీర్షికకు చేరబడి ఆలోచన ప్రారంభించాడు— ఆరేళ్ళనుంచి బి. ఏ. పేసై నిరుద్యోగ సమస్యకు గురియై ఉద్యోగం కోసం ఆఫీసర్లతో హోరాహోరీ పోరాడుతూన్న లోకనాథానికి ప్రకటనలు అంతులేని ఆశకల్పించినై. గ్రంథమాలవాళ్ళు లోకనాథాన్ని మూడు విధాలుగా ధనసహాయంచేసి గౌరవించడానికి దారిచూపించారు. ఆలోచించి ఆలోచించి చెదపురుగులను సంహరించేమందు తాను కనిపెట్టి ప్రపంచగ్రంథ సంరక్షణంచేసి కీర్తి సంపాధించాలని నిశ్చయించుకున్నాడు. ఎందుకైనా తనఅర్ధాంగి సలహా తీసుకోవటం మంచిదని ఒక్కసింహగర్జన చేశాడు- ఆఅరుపుతో సుబ్బులు మెరుపులాగ అతనికళ్ళముందు మెరిసింది. ఒకసారి ఆమెను ఆపాదమస్తకం చూచి ఆవేశంతో ప్రకటనలు మూడూ చదివి వినిపించాడు—

'ఈమూడూ విన్నావుకదా? నాకీమూడింట్లో తగిందిచెప్పు'

"మీకు మొదటి ప్రకటనే బాగుంటుంది- పద్యాలు కంఠతాపెట్ట గలరు— ఆపద్యాలువ్రాసిన కవిని పొగడగలరు"

కృష్ణశర్మ

వెర్రిదానా అందులో ఎంతకష్టం ఉందో నీకేం తెలుసు। స్టేజీమీద బండా బ్రదర్‌లాగ పద్యాలు చదువుతానుకాని వాటి అర్థం నాకేంతెలుసు? పద్యాలు పాడటం నావొంతు- అర్థం తెలిసి సంతోషించడం ఆడియన్సు వొంతు,"

"మీరు రెండో ప్రకటనకి పనికిరారు— ఉభయభాషా ప్రవీణవిద్వాన్ పేస్సైతేగాని చెదపురుగులు దులిపి పుస్తకాలు ఎండలో పెట్టడానికి పనికి రారట "

అందుకే చెదపురుగులను సంహరించే మందుకనిపెట్టి సన్మానాలూ బహుమతులూ బిరుదులూ సంపాదించడానికి నిశ్చయించుకున్నాను"

'ఆమందు కనిపెట్టడానికి డబ్బుకావాలేమో'

'డబ్బు బ్రహ్మాండ గ్రంథమాలవాళ్లే భరిస్తారు-"

వెంటనే కాగితంతీసి ఉత్తరం ప్రారంభించాడు—

"చూడండి మీరీమందు కనిపెట్టగలరన్న ధైర్యంవారికి కలుగుతే కాని డబ్బు పంపుతారా?"

'ఔను ఇదీ నిజమే- ఇదివరకు ఇలాటిమందులు కనిపెడుతూ వున్నట్టువాళ్ళకి తెలియాలి- కనక కొన్ని బిరుదు విశాసీలు ముందు తగిలిస్తాను."

"ఈబిరుదులు ఎవరిచ్చారని అడుగుతే"

'నాభార్యయిచ్చిందని చెప్తాను. అంతగాపస్తే కీర్తిశేషులైన బుర్రా శేషగిరిరావుగారు మందుల కోవిద, మందుల వినోద అని బిరుదు ఇచ్చారంటాను।"

ఉత్తరం వ్రాశాడు.

'బ్రహ్మాండ గ్రంథమాలవారికి (శ్రీ శ్రీ) మందులనాక సింహ, మందుల మహావీర, మందుల సరస్వతి, మందులభాషా

ప్రౌఢ

ప్రసిద్ధ, మంత్రుల మహాత్మ్య ఇత్యాది శతాధిక బిరుద విరాజిత దుంపా అప్పారాయ పుత్ర లోకనాథం వ్రాసుకున్న ఉత్తరం—

అయ్యా, ఆర్ అప్పా!

డింకీ పత్రికలో మీరు ప్రకటించిన ప్రకటన చదివితిని. చెడపురుగులను సంహరించుటకు అద్భుతమైన మందు రసాయనశాస్త్రము ననుసరించి నేను తయారు చేయగలను. అందులకు వెయ్యిరూపాయలు కర్చుఅగును. వెంటనే వెయ్యి రూపాయలూ తమరు పంపవలెను. నేటి మొదలు నెల దినములలోగా మీకు మందు తయారుచేసి యిచ్చెదను. నేను తయారుచేయజాలనప్పుడు మీడబ్బు మీకు వాపసు చేయుటకు నేనూ నాభార్యాజన ఇష్టమూ అంగీకరించుచున్నాము.

ఇట్లు

డి. లోకనాథం బి. ఎ. వ్రాలు.

"నువ్వూకూడా సంతకం చెయ్యి"

"నాసంతకం ఎందుకండీ"

"వాళ్ళు నమ్మవద్దూ? వీడు సన్నాసి వెధవకాడూ— పెళ్ళాం పిల్లలూ పిచికా మేకా ఉన్నవాడే— కనుక డబ్బు పంపినా పోదన్న నమ్మకం కలుగుతుంది చూడు"

సంతకం చేయించి ఉత్తరం పోస్టు చేశాడు. నాలుగు దినాలనాడు జవాబువచ్చింది.

కృష్ణశర్మ

"మాజమీందారు కవిసార్వభౌములు, వారి అఖండ పాండిత్యమును అర్థం చేసుకొని వారిగ్రంథాలలో సారస్యం గ్రహించే శక్తి ఆంధ్రులకు లేకపోవుటచేత వారిగ్రంథములు అలాగే ఉన్నవి. వారు శతాధిక గ్రంథాలు వ్రాశారు— శతసహస్ర ప్రతులు బీర్వాలలో చెదపట్టుచున్నవి. శ్రీజమీందారువారు మీరుకోరినట్టూ మందుకనిపెట్టే నిమిత్తం వెయ్యి రూపాయలూ పంపినారు కనుక త్వరలో మందుకనిపెట్టి— చెదపురుగుల బారినుండి శ్రీ జమీందారుగారి గ్రంథములనే గాక ప్రపంచసాహిత్యమునే కాపాడమని కోరుచున్నాము."

డింకీపత్రికలో పెద్ద అక్షరాలలో—

"చెదల సంహారిణి— మీగ్రంథములను, మీకాగితములను కాపాడుకొనుడు. రసాయనశాస్త్రజ్ఞుడు మందులమహాత్మాది శతాధిక బిరుద విరాజితులు శ్రీ శ్రీ దుంపాలోకనాథంగారు...జమీందారువారిచే ప్రోత్సహింపబడి చెదపురుగులను నిర్మూలించే మందు కనిపెట్టించుచున్నారు. గ్రంథాలయములకూ గ్రంథమాలలకూ మహోత్తరుణమూ—

వలయువారు—

బ్రహ్మాండగ్రంథమాలకు వ్రాయుడు.

లోకనాథానికి వెయ్యిరూపాయల చెక్కువచ్చింది. తక్షణం దెంతులో చెక్కుమార్చి, భార్యకో డజను చీరలూ రెండు డజన్ల జాకెట్లూ— తనకో కొన్ని ధోవతులూ నగ్రెరా— ఇంటిసామాన్లూ— ఇతోధికంగా

దత్త

బార్యకు లోలక్కులూ ఉంగరం తెచ్చి భార్యముందు పెట్టాడు. హిందీ, ఇంగ్లీషు పత్రికలలో తాను మందుకనిపెడుతూన్నట్టు ప్రకటన పడింది. లోకనాధానికి ఇంగ్లండు అమెరికా ఫ్రాన్సు జర్మను జపాన్ మొదలైన విదేశాలనుండి అతని సైన్సు రీశర్చిని అభినందిస్తూ- ప్రొఫెసర్లనుంచి శత పరంపరగా ఉత్తరాలు వస్తున్నై- ఆంధ్రదేశంలో, పుస్తకాల వర్తకులూ గ్రంథాలయాలూ- గ్రంథమాలలవారూ తెగవ్రాస్తున్నారు- లోకనాధం ఇంకా పనిప్రారంభించలేదు- లోకనాధానికి రానురాను బాధ్యత ఎక్కువై పోయింది- నలుమూలలనుంచీ వత్తిడి- మందుకనిపెట్టక తప్పనిసరి వచ్చింది- జమిందారుగారు స్వయంగా బయలుదేరివచ్చి- ఎంతవరకుపని జరిగిందో తెలుసుకుందుకు రాబోతున్నారు.

లోకనాధం నాలుగుసీసాలు, నాలుగుజాడీలూ- కొంతగాజు సామగ్రీ గదిలో పేర్చి కొన్నిసీసాల్లో తలనూనే, ఆముదం- నూనే- వెన్నమొదలైన పదార్థాలుపెట్టి వచ్చిపోయేవారికి తనరీసెర్చి గురించి చెబుతూదినాలు గడుపుతున్నాడు.

లోకనాధం మందుకనిపెట్టేమార్గాన్ని అన్వేషిస్తున్నాడు,

'ఆహా యుద్ధంలో మనుష్యులను చంపడానికి ఇన్నిమారణ యంత్రాలు ఎలాగకనిపెట్టారో కదా? చెదపురుగుల్ని చంపడానికి యంత్రము కనిపెట్టలేకుండా ఉన్నాను."

మరునాడు జమీందారుగారు లోకనాధానికి రిజిష్టరీఉత్తరం ఇచ్చాడు,

"మీరు చెదపురుగులనుచంపే పెట్టెమందు కనిబెడతామని మానుండి నెల దినాలక్రిందట వెయ్యూరూపాయిలుపుచ్చుకున్నారు. ఇంతవరకు మీరు అట్టిమందును కనిపెట్టియుండలేదు. ఈఉత్తరమందినవెంటనే అనగా వారముదినములలోగా

కృష్ణశర్మ

మీరు మందుకనిపెట్టిపంపవలెను. లేనప్పుడు మీరు తెలియ జేసినట్లు మా వెయ్యిరూపాయిలూ తిరిగి పంపవలెను- అట్లు చేయలేనప్పుడు మీపై కోర్టులో క్రిమినలైనచర్య జరిగించ బడును.

లోకనాథానికి తలగిర్రున తిరిగిపోయింది. తాను కొన్న గుడ్డలూ వస్తువులూ అతనియెదురుగానించొని అస్పష్టంగా ఏమిటో ప్రశ్నిస్తున్నాయి. కుర్చీకి చేరబడిపోయాడు– ఎదురుగా వేలూలక్షలూ చెదపురుగులు కని పించాయి అన్ని చెదపురుగులూ ఒకపెద్ద పురుగుగా మారి ఆప్రదేశాన్ని ఆక్రమించి లోకనాథానికి ఎదురుగా నించుంది. లోకనాథం భయకంపితు డైపోయాడు. "శత్రువు- శత్రువు" హాహాకారం చేశాడు చెదపురుగు లోకనాథాన్ని సమీపించి కళ్ళు గిరగిరా త్రిప్పుతూ ఉరుములు ఉరిమినట్టు ధ్వనిచేస్తూ—

'ఔరా రాస్కెల్ మాజాతిని నిర్మూలించే మందు కనిపెడతావా?' లోకనాథం- విశ్వరూపం ధరించిన చెదపురుగును చూచి భయపడ్డాడు. 'మేము మానవజాతికి ఎంతసేవచేస్తున్నామో గ్రహించావా!" లోకనాథం కాస్త ధైర్యంతో....

"మాపవిత్రగ్రంథాలను ధ్వంసచేసి. మాసాహిత్యాన్నిసర్వనాశనం చేస్తూన్న మీరు మాకు శత్రువులు"

'ఏమిటీ! పవిత్రగ్రంథాలా! మాకు పవిత్రాపవిత్ర గ్రంథవిచక్షణ లేనేలేదు.

మీకే భాష సారస్యం తెలుస్తే గ్రంథభక్షణ చెయ్యనే చెయ్యరు చక్కనిగ్లేజు కాగితాలమీద అచ్చువేసి. బైండుచేయించి బీర్వాలలో మేం పుస్తకాలు భద్రపరచుకుంటె అక్షరాని కొక్కటిగా మీరా పుస్తకాల్ని భక్షిస్తున్నారు.'

ఏము

"భాషాసారస్యం భావసారస్యంలేని నిరుపయోగ గ్రంథసంఖ్య హెచ్చుపెరగడంచేతనే మా జనాభా నూరింతలు పెరిగిపోయింది"

"మీవల్ల ఎంతెంతో ఖరీదైన పుస్తకాలు ధ్వంసం అయిపోతున్నాయి, ఏరైల్వే నవల్లో మీరు తినిఉంటే బాగుండును అలాకాకుండా పుస్తకాల విలువతెలియకుండా భక్షించడం ధర్మంకాదు."

"పిచ్చివాడా పుస్తకాల విలువ మేం కనిపెట్టినట్టు మీరుకనిపెట్టలేర్రు. రామాయణం భారతం భగవద్గీత మొదలైన పవిత్రగ్రంథాలు నిత్యపారాయణగా పూజలో ఉంచుకుంటారు. అక్కడికి మేం వెళ్లలేం కొవ్వలివారి రైల్వే పుస్తకాలు చిరిగిపోయే వరకూ ప్రజలచేతుల్లో తిరుగుతూనే ఉంటాయి- ఎటొచ్చీ మీకూ మాకూ ప్రపంచంలో ఎవరికీ యేకాలనికీ పనికీ పనికిరాని విరహ గీతాలూ, ఏడుపు కావ్యాలూ ఇత్యాది గ్రంథాలు ఎవరికీ పనికిరాకుండా బీర్వాల్లో మూలుగుతూ ఉంటాయి- పైగా చక్కని గ్లేజు ఫెదర్‌వెయిట్ మొదలైన ఖరీదైన కాగితాలమీద అచ్చువేస్తారు- ఆకాగితాలు మాకు మహాయిష్టం ఏవి మీకు రుచించవో ఆపుస్తకాలు మాకు రుచిస్తాయి.'

'పోనీ కాగితాలు కాకపోతే మరేమైనా తిని జీవించకూడదూ?
కాఫీ— ఇడ్లీ- పెసరట్- దోశ- ఇత్యాది వస్తువులు"

"దేవుడు మాకు దుస్సాహిత్యాన్ని చంపడానికే పుట్టించి నిరుపయోగగ్రంథ భక్షణమే మాకుక్షి పూర్తికి సృష్టించాడు- నీకేం తెలుసువాటి రుచి- నవ్యసాహిత్య గ్రంథమాలవారి యేడుపుకావ్యాలరుచి మాకు తెలిసినట్టు మీకు తెలీదు. తేలికైన ఫెదర్‌వెయిట్ పేపర్ ఒక్కొక్క ముక్క తింటే బిస్కట్ తిన్నట్టుంటుంది. గ్లేజుపేపర్లో మాకు పనికొచ్చే. ఎ,బి,సి మూడు తరగతుల విటమిన్సున్నాయి. రైల్వే సారస్వతగ్రంథాల్లో రచనలవలె కాగితాలుకూడ నీరసంగానే వుంటాయి. అయినా అవి మనకుఅందుబడిలో ఉండవు. నమ్మాళ్వార్సు పుట్టి మాకు భిక్షపెట్టాడు- టిష్ పేపరు కాన్స్టిపేట్ చేస్తుంది.

కృష్ణశర్మ

"ఏదిశింది! ఈగదిలో చూశావా? ఈమందులు పీటితో మీజాతి నిర్మూలిస్తాను"

'అందులో ఏమున్నాయో నాకు తెలుసు. కామినీ హెరాయిలా-గ్లిసరైన్- వెన్నా. నూనే నెయ్యీ! చూపించి దడిపిస్తున్నావా? పేరేర్"

"ఆహా! చెదపురుగు నీకెంత పూర్వజ్ఞానం ఉంది? నీకు నమస్కరిస్తున్నాను. అయితే ఈదీనుడు మీతో యుద్ధంచేసి మీజాతిని నిర్మూలించలేడూ?"

"హిట్లరుకూడా మాజాతిని నిర్మూలించలేడు. వాడిటాంకులూ-షెంకులూ మాముందు గడ్డిపోచకు పనికిరావు- తెలుసునా!

'తెలుసుకున్నాను- తెలుసుకున్నాను."

'మీదేశంలో వెలరేగుతూన్న దుస్సాహిత్యాని చీల్చి చెండాడుతూన్నందుకు మీరు నన్ను అభినందించాలి. ఒకలాగ చెయ్యండి. కొంతకాలం రైల్వే సారస్వతం చుక్కమ్మ పుల్లమ్మ ఇత్యాది నమ్మకాల్ సాహిత్యం- రోదనం- దీనాలాపం- ఆర్తనాదం మొదలైన నవ్యసాహిత్య ప్రచురణాలూ స్టాప్‌చేయించండి. అందువల్ల తిండిలేక మాజాతి కొంత నశిస్తుంది—'

'అప్పుడు పూజ్యమైన గ్రంథాలమీదికి పోతారేమో?"

"నిత్యం వాడుకలోవున్న గ్రంథాల పొలిమేరకు కూడా మేము వెళ్ళము'

"తేంక్యూ?

నిరర్థక సాహిత్యం ఏదేశంలో ఎక్కువగా ఉంటే మేమాదేశంలో ఎక్కువగా ఉంటాం. మరినేను వెళుతున్నాను.

చెదపురుగు రెక్కలొచ్చి గిరుక్రిన ఏరోప్లేనులాగ ఎగిరిపోయింది. మరిపదిదినాలనాడు "కింకి" పత్రికలో లోకనాథం తన రిసెర్చి ప్రకటించాడు.

కొ నిప్పు

'కడుప్రయాసతో బహువ్యయముతో నేను తలబద్దలుచేసుకొని కనిపెట్టిన చెదపురుగుల సంహారిణి మహాజ్ఞాన సూత్రము ఎట్టిదనగా—

ఈనాడు దేశంలో పనికిరానిచెత్తసాహిత్యం ఎక్కువగా ప్రకటింపబడుతూంది. ప్రజల ఉపయోగంలేని గ్రంథాల సంఖ్య పెరగడంవల్ల చెదపురుగులసంఖ్య అధికమై పోయింది. ఎక్కువ ఖరీదుగల కాగితాలపై నిస్సారమైన రచనలు అచ్చుపడిపోవడం దీనికి ముఖ్యకారణం. గనుక ఆంధ్రులందరూ కట్టుకట్టి పట్టుదలతో కొంతకాలము చెత్తపుస్తక ప్రకటన నిరర్థక గ్రంథప్రచురణ మానివేస్తే తిండిలేక చెదపురుగులు వాటంతట అవే చావగలవు. కనుక మనము దుస్సాహిత్యం పుస్తకరూపం పొందకుండా చెయ్యాలి. ఇంతకు తప్ప వేరే చెదను సంహరించడానికి మందులేదు.

పై ప్రకటన డింకీపత్రికనుండి మరికొన్ని ఇంగ్లీషు పత్రికలలో ప్రకటితమయింది. ఈసూత్రం కనిపెట్టినందుకు వివిధ గ్రంథాలయ సంస్థలు చాలాఅభినందించాయి— సభచేయించి జమీందారువారు వెయ్యిన్నూట పదహార్లూ చెద సంహారక మహాబిరుదూ ఇచ్చి లోకనాథాన్ని సత్కరించారు.

*

కృష్ణశర్మ